# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా ప్రభుత్వ సేవలు ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.
- ❖ పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను సురక్షితంగా తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
- ❖ గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించి సహాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు జరిగిన “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం ద్వారా ఉన్నతాధికారులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

========================

ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా ప్రభుత్వ సేవలుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఆ దిశగా అన్ని శాఖల పనితీరు మెరుగుపడాలంటే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి తావులేకుండా అధికారులు పని చేయాలన్నారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌లలో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సేవలు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. బస్టేషన్‌లలో టాయిలెట్స్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు ఎక్కువవుతున్నాయని... ఇటువంటివి మళ్ళీ పునరావృతం కాకుండా బాణసంచా తయారీకి ప్రఖ్యాతిగాంచిన తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

========================

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను సురక్షితంగా తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై ఆర్టీజీఎస్ అధికారులు, ఏపీఎన్ఆర్టీ

ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో ఈరోజు సమీక్షించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలను తిరిగి స్వస్థాలకు రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

========================

గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగువారిని క్షేమంగా స్వస్థలాలకు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు. ఆయా దేశాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశంపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఢిల్లీలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీ ఎన్ఆర్టీఎస్) కో-ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామని చెప్పారు. స్థానికంగా ఉన్న భారత రాయబార కార్యాలయ సేవలను, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు 0863-2340678, వాట్సాప్ 85000 27678 నంబర్లను సంప్రదించి సహాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

========================

పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వర్చువల్ విధానంలో ఈరోజు ఆన్‌లైన్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీకాకుళం పట్టణంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ప్రజలు వినతులు అందించగా.. వర్చువల్ విధానంలో అర్జీదారులతో మాట్లాడి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు సమస్యలను చేరవేసి పరిష్కారానికి ఆదేశించారు. ఈ ఆన్‌లైన్ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా మొత్తం 56 మంది అర్జీదారులతో రామ్మోహన్ నాయుడు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

========================

అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ లో ఈరోజు నిర్వహించిన పి.జి. ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొని జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

========================

పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక పారిశ్రామిక నగరం ఏర్పడుతుందని, అది ప్రధాన ఉత్పాదక పెట్టుబడుల కేంద్రంగా మారుతుందని తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నిలయంగా మారుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో కృష్ణపట్నం, చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు.

========================

ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారులకు ఎదురవుతున్న అంతర్ రాష్ట్ర సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. పులికాట్ సరస్సు పరిధిలో జీవనోపాధి కొనసాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు ఇటీవలి కాలంలో ఎదుర్కొంటున్న వివాదాలు, సరిహద్దు సమస్యలు, భద్రతా అంశాలు వంటి విషయాలపై కలెక్టర్ ఎస్. వేంకటేశ్వర్, ఎస్. పి. సుబ్బారాయుడుతో కలసి స్థానిక కలెక్టరేట్ నుండి తిరువళ్లూరు జిల్లా ఉన్నతాధికారులతో వర్చువల్ గా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మత్స్యకారుల జీవనోపాధి రక్షణపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో చోటు చేసుకున్న సంఘటనలను సమీక్షించి, భవిష్యత్‌లో అలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా సమన్వయంతో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

========================

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా వారు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తాడేపల్లిగూడెం NIT అకడమిక్ డీన్ డాక్టర్ ఎన్.జయరామ్ అన్నారు. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు NIT ప్రాంగణాన్ని ఈరోజు సందర్శించారు. ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, వర్క్ షాపులు, గ్రంథాలయాన్ని పరిశీలించి.. యంత్రాలు, పరికరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జయరామ్ మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను పాఠశాల స్థాయి నుంచే అలవర్చుకోవాలన్నారు. విభిన్నమైన ఆలోచనలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని, అవి వారి వ్యక్తిత్వానికి దోహదపడేలా ఉండాలని అన్నారు.

========================

సింహాచలంలో కొలువుదీరిన వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో జరిగే సంవత్సర ఉత్సవాలలో భాగంగా ఫాల్గుణ పున్నమి సందర్భంగా రేపు డోలోత్సవం జరగనుంది. రేపు చంద్రగ్రహణం నేపథ్యంలో ఉదయం సుమారు 4 గంటలకు స్వామివారిని మెట్ల మార్గంలో కొండదిగువకు తీసుకువచ్చి పుష్కరిణి సత్రంలోని ఉద్యాన మండపంలో డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు.

========================
========================